క్లుప్తంగా

చిన్నారి అశ్వియ అంజుమ్ హత్యకు నిరసనగా ర్యాలీ

రేపు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహణ

నరసరావుపేట: చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో గత నెల 29వ తేదీన అదృశ్యమైన ఆరేళ్ల చిన్నారి అశ్వియ అంజుమ్ హత్యకు నిరసనగా ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక గుంటూరు రోడ్డులోని పెద్ద మసీదు నుంచి గడియార స్తంభం సెంటర్‌లోని అంబేడ్కర్ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం నిందితులను సత్వరమే అరెస్టు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయటం జరుగుతుందన్నారు. పట్టణంలోని ముస్లిం సోదరులు, అన్ని ప్రజా సంఘాలు నాయకులు, ఏఐఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం

ఈపూరు: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలను పెంచి సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలను పెంచడం శోచనీయమన్నారు. హిందూమతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. రాష్ట్రంలో ఇసుకను అందుబాటులోకి తెచ్చి పని కల్పించి కార్మికులను ఆదుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కార్యదర్శిగా మేడికొండ దేవసహాయంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంతరెడ్డి, ఎం.మరియమ్మ, ఎం.దేవసహాయం, ఆర్.గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



రొంపిచర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రొంపిచర్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సందర్శించిన సందర్భంగా దేవాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. బ్యాంక్ ఆడిటర్ శ్రీరామ్ కమలాకర్, ధర్మకర్త రామ్ బ్రహ్మానందరావు, ఎస్‌బీఐ మేనేజర్ మల్లికార్జున్‌రావు, గొడవర్తి శ్రీనివాసరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, కొప్పు కోటయ్య, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో నాలుగు నూతన బస్సులను ఎమ్మెల్యే జీవీఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ నుంచి గుంటూరు వరకు 90 కిలోమీటర్ల హైవేను 4 వరసలుగా విస్తరించబోతున్నామని, తద్వారా ప్రయాణ సమయంతో పాటు ప్రమాదాలు కూడా తగ్గుతాయన్నారు. గంటలోనే వినుకొండ నుంచి గుంటూరుకు చేరుకునే అవకాశం ఉందున్నారు. డిపో నుంచి 25 కొత్త బస్సులను ప్రారంభించామని, అద్దె బస్సులు పెట్టే వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో వినుకొండ డిపోను ఆధునికీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాంబదేవి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న కెల్లంపల్లి వారి ఇలవేల్పు రేణుకాంబ, గంగాదేవి ఆలయ తొలి వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పూజారి దర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అభిషేకాలు, శాంతి హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కెల్లంపల్లి కుటుంబీకులు అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆర్‌యూబీ లేక అగచాట్లు!

- ఇటీవల జంక్షన్‌గా మారిన శావల్యాపురం రైల్వేస్టేషన్
- పెరిగిన రైళ్ల రాకపోకలు
- శావల్యాపురం 268 రైలు గేటు వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు
- సత్వరమే ఆర్‌యూబీ నిర్మాణం ప్రారంభించాలని వాహనచోదకుల డిమాండ్



శావల్యాపురం రైలుగేటు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం రైల్వే గేటు వద్ద (నంబరు 268) రైల్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శావల్యాపురం రైల్వే స్టేషను జంక్షన్ కావటంతో రైళ్ల రాకపోకలు సంఖ్య పెరిగింది. దీంతో రైల్వేగేటు తరచుగా పడుతుండడంతో శావల్యాపురం నుంచి బొందిలిపాలెం, శానంపూడి, మతుకుమల్లి, కారుమంచి, గుంటుపాలెం, వయ్యకల్లు, భాస్కర్‌నగర్, చినకంచర్ల, పిచికలపాలెం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిరోజూ 40 నుంచి 60 రైళ్ల రాకపోకలు

డబుల్ ట్రాక్ వలన ప్రతిరోజు 40 నుంచి 60 వరకు రైళ్లు, గూడ్స్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో అధికంగా గూడ్స్ రైళ్లు ఉన్నాయి. ఒక్కసారి గేటు వేస్తే కనీసం అర్ధగంట వరకు ఆగిపోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో రైలే గేటు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గుంటూరు డీఆర్‌ఎం మంగళగిరి రామకృష్ణ శావల్యాపురం రైల్వేస్టేషన్‌ను సందర్శించిన సమయంలో ఆర్‌యూబీ ఏర్పాటు ఆవశ్యకతను స్థానికులు లిఖిత పూర్వకంగా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌యూబీ నిర్మాణం జిల్లా కలెక్టరు నుంచి పరిపాలన ఆమోదం పొందిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని డీఆర్‌ఎం తెలిపారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు పురోగతి లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలుగేటు పడిన తర్వాత అరకిలో మీటరు వరకు వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోతున్నాయి. సత్వరమే ఈ రైలు గేటు స్థానంలో ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సత్వరం ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలి



శావల్యాపురం గ్రామం రైలు గేటు అవతల ఎస్టీ కాలనీలో మేం నివాసం ఉంటున్నాం. నిత్యం ఇదే మార్గంలో బైకుపై రాకపోకలు సాగిస్తాను. అయితే రైలుగేటు పడితే 20 నిమిషాల నుంచి అర్ధ గంట వరకు ఆగిపోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం శావల్యాపురం రైల్వే స్టేషను జంక్షన్ కావటం చేత రైళ్ల రాకపోకలు పెరిగాయి. రైల్వే అధికారులు సత్వరం ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలి.

– పోట్లూరు మల్లిఖార్జునరావు, శావల్యాపురం

తీవ్ర ట్రాఫిక్ సమస్యలు



నేను ప్రతిరోజు బొందిలిపాలెం నుంచి వివిధ పనులపై శావల్యాపురం వస్తాను. అయితే శావల్యాపురం రైలుగేటు తరచుగా వేస్తుంటారు. దీంతో ఇక్కడ తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ సత్వరమే ఆర్‌యూబీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– బత్తుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్, బొందిలిపాలెం

రాజకీయ ఒత్తిళ్లతోనే కార్మికుల తొలగింపు

- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- సీఐటీయూ నాయకుల డిమాండ్



దీక్షా శిబిరంలో కార్మికులకు సంఘీభావం తెలిపిన సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత నాలుగురోజులుగా మున్సిపల్ కార్యాలయం ముందు దీక్షలు చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఆదివారం సీఐటీయూ నాయకులు శిలార్ మసూద్, మస్తాన్‌వలి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా పట్టణ గౌరవాధ్యక్షుడు శిలార్ మసూద్ మాట్లాడుతూ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అర్థాంతరంగా పనిలోకి రావొద్దని చెప్పి బెదిరించి ఆపేశారన్నారు. రెండు నెలల నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా ఫలితం లేదన్నారు. అయితే కమిషనర్ పనికి రావొద్దని చెప్పలేదని గ్రీవెన్స్‌లో చెప్పారన్నారు. గత 21 ఏళ్లుగా పార్టీలు మారిన వెంటనే ఎవరినీ తొలగించలేదు అన్నారు. పట్టణం పెరిగి, కార్మికులు అత్యవసరంగా కావాల్సిన పరిస్థితిలో ఉన్న కార్మికులను తొలగించటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణ కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో తామేమీ చేయలేమని అధికారులు చెబుతున్నారన్నారు. వెంటనే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు యడ్లపాడులో ప్రజాదర్బార్

నాదెండ్ల: యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ జరగనున్నట్లు ఎంపీడీఓ హేమలతాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ప్రజా దర్బార్‌కు ఎమ్మెల్యే ప్రత్తిపాటి హాజరుకానున్నారన్నారు.

ఏఎంజీని సందర్శించిన కడప విద్యార్థులు



విజ్ఞాన యాత్రకు విచ్చేసిన విద్యార్థుల బృందం

చిలకలూరిపేటటౌన్: విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగపడతాయని చిలకలూరిపేట ఎంఈఓ కె.లక్ష్మి పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బృందం ఆదివారం పట్టణంలోని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థను సందర్శించారు. స్వర్ణాంధ్ర – 2047లో భాగంగా బృందం సంస్థను సందర్శించినట్లు తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ తోలేటి శివశంకర్ ఆదేశాల మేరకు బృందం విచ్చేసినట్లు వెల్లడించారు. కడప నుంచి అరకు వరకు కొనసాగే ఈ విహార యాత్రలో పాఠశాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. యాత్రగా వచ్చిన విద్యార్థులకు ఏఎంజీ సంస్థ వసతి కల్పించినట్లు ఎంఈఓ తెలిపారు. అనంతరం ఎంఈఓ లక్ష్మి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి పాఠశాలల్లో విద్యా విహార యాత్రల నిర్వహణ సంస్కృతి, సామాజిక, చారిత్రక విశేషాలను విద్యార్థులు నేర్చుకునే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వసతి, అల్పాహారం అందించిన ఏఎంజీ డైరెక్టర్ అరుణ్ కుమార్ మహంతి, వసతి తదితర ఏర్పాట్లు పర్యవేక్షించిన ఏఎంజీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కృపాదానం, చిలకలూరిపేట ప్రైవేటు హైస్కూల్స్ అసోసియేషన్ సభ్యులకు ఎంఈఓ కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం



దరఖాస్తు విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు

ఈపూరు: నూతన మద్యం విధానంలో భాగంగా ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో మొత్తం 9 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను చేసుకోవాలని స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద టెండర్ విధానంపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల మండలంలో 4, బొల్లాపల్లి మండలంలో 3, ఈపూరు మండలంలో 2 మద్యం దుకాణాలకు ప్రకటన ఇవ్వడం జరిగిందని, ఆసక్తి ఉన్న వారు ప్రతి అప్లికేషన్‌కు రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 11వ తేదీన నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని టౌన్ హాల్‌లో లాటరీ తీయడం జరుగుతుందని వివరించారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



శావల్యాపురంలో కళకళలాడుతున్న వరి పంట

శావల్యాపురం: మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు వరి నాట్లు వేయడం, తదితర వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు ఆదివారం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఖరీఫ్ సీజను వరకు 3500 వందల ఎకరాలు వరి పంట సాగు చేశారన్నారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో రైతుసేవా కేంద్రం వీఏఏల సారథ్యంలో ఈ–పంట నమోదు పారదర్శకంగా పూర్తి చేయటంతో పాటు రైతుల బయోమెట్రిక్ నమోదు చేయటంతో జిల్లాలో శావల్యాపురం మండల ప్రథమ స్థానం నిలిచినట్లు ఏఓ తెలిపారు. ప్రస్తుతం రబీ సీజను ప్రారంభం అయిందని ఏఓ వెల్లడించారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు.

80 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నరసరావుపేట రూరల్: మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామం వద్ద లారీలో తరలిస్తున్న 80 బస్తాల రేషన్ బియ్యంను రూరల్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. యడ్లపాడు మండలం కొండవీడుకు చెందిన ముజావర్ శిలార్, ఫిరంగిపురంకు చెంది సాలె వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సుఖమయ జీవనానికి యోగా దోహదం



శిక్షణ పొందిన అభ్యాసకులతో యోగా గురువు శ్రీనివాసరావు

నరసరావుపేట ఈస్ట్: నేటి ఒత్తిడితో నిండిన ప్రపంచంలో సుఖమయ జీవనానికి యోగా ఉత్తమ మార్గమని శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం (మంగళగిరి) వ్యవస్థాపకుడు వేంకటేశ్వర యోగి తెలిపారు. బరంపేటలోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో గత నెలరోజులుగా నిర్వహించిన 179వ ఉచిత యోగా శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా అభ్యాసకులతో వేంకటేశ్వర యోగి ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శిబిరంలో శిక్షణ పొందిన ఆసనాలు, ధ్యానం, ఆహార నియమాలను నిత్యం పాటించటం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించవచ్చని తెలిపారు. వినయ విధేయతలు, శాంతం, సహనంతో ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకునే మానసిక స్థైర్యాన్ని యోగా అందిస్తుందని వివరించారు. ఈసందర్భంగా అభ్యాసకులకు జ్ఞాపికలు అందజేశారు. యోగా గురువు జిల్లి శ్రీనివాసరావు, యోగా శిబిరం సహాయకులు గడ్డం శ్రీనివాసరావు, రావూరి సాంబశివరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు రాఘవరపు చిన్ని, విజయరావు, గుబ్బా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర, శరీరదానంపై అవగాహన అవసరం

- అవయవదాన ప్రోత్సాహకుల సంఘం పల్నాడు, గుంటూరు జిల్లాల కో–ఆర్డినేటర్ ఎస్.చలపతిరావు
- పల్నాడు విజ్ఞాన కేంద్రంలో అవయవదాన సదస్సు



మాట్లాడుతున్న చలపతిరావు

నరసరావుపేట: అవయవదానం ప్రాణదానమని, మెడికల్ కళాశాలలకు ప్రయోగాల నిమిత్తం అందజేసే శరీరదానం విద్యాదానంతో సమానమని అమ్మా నేత్ర, శరీర, అవయవదాన ప్రోత్సాహకుల సంఘం పల్నాడు, గుంటూరు జిల్లాల కో–ఆర్డినేటర్ ఎస్.చలపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో నేత్ర, శరీర అవయవ దానంపై సదస్సు నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యుడు కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. చలపతిరావు మాట్లాడుతూ మనిషి మరణానంతరం కట్టెలో కాలిపోయే లేదా మట్టిలో కలిసిపోయే శరీరాన్ని దానం చేయడం వలన ఎటువంటి నష్టం లేదని అన్నారు. నేత్రదానం మరొకరికి చూపును ప్రసాదిస్తుందని చెప్పారు. నేత్ర, అవయవ, శరీరదానంపై ప్రజలు అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సీపీఎం సీనియర్ నాయకుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ విజ్ఞాన అవగాహన సదస్సులో భాగంగా శరీర అవయవ దానంపై సదస్సు నిర్వహించామన్నారు. ప్రజల్లో అభ్యుదయ భావాలు రేకెత్తించడం, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే ఆయా అంశాలపై అవగాహన కల్పించడంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ముందుంటుందన్నారు. నేత్ర, అవయవ, శరీర దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, దీనిపై ముందుగా ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయించుకోకపోయినా మరణానంతరం ట్రస్టు సభ్యులకు సమాచారం అందజేస్తే సరిపోతుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా రామబ్రహ్మం, సభ్యులుగా కామినేని రామారావు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, అంకారావు, చలపతిరావు, మహమ్మద్‌రఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, కమిటీ సభ్యులు డి.శివకుమారి, ఎ.భాగేశ్వరిదేవి, ఎస్.ఆంజనేయరాజు, సుభాష్ చంద్రబోస్, బి.సలీం, పాల్గొన్నారు.



విప్పర్లలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా కామాక్షి అమ్మవారు



రవ్వవరం జగన్మాత పీఠంలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



లలితా త్రిపుర సుందరీ అలంకారంలో నరసరావుపేట రెడ్డినగర్ బతుకమ్మ



నాదెండ్ల కోదండరామాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా ..

లలితా త్రిపుర సుందరీ నమోస్తుతే!



విఠంరాజుపల్లి చిన్నషిరిడీ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగోరోజు ఆదివారం ఆయా ఆలయాల్లో అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, ఇతర అలంకారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– నరసరావుపేట ఈస్ట్, రొంపిచర్ల, నరసరావుపేట రూరల్,వినుకొండ (నూజెండ్ల) ,నాదెండ్ల,శావల్యాపురం



భువనేశ్వరి అలంకారంలో జ్ఞాన సరస్వతి అమ్మవారు



నరసరావుపేటలో గాయత్రీమాత అలంకారంలో విజయ చాముండేశ్వరీ



శావల్యాపురంలో శ్రీలలితా త్రిపుర సుందరి అలంకారంలో కనకదుర్గమ్మ



నరసరావుపేట శ్రీసత్యసాయి మందిరంలో శాకంబరీ అలంకారంలో..



లింగారావుపాలెం దేవాలయంలో ధనలక్ష్మిగా..

అల్లుకున్న నిర్లక్ష్యం



నరసరావుపేట: పట్టణంలోని పలు రోడ్లలో గృహాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందజేసేందుకు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతుంది. ప్రకాష్ నగర్ 60 అడుగుల రోడ్డులోని జెండా చెట్టు వీధి మూలమీద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లపొదలు, తీగలు అల్లుకొని ఉన్నాయి. వీటి ద్వారా పాములు, తొండలు, బల్లులు ట్రాన్స్‌ఫార్మర్‌పైకి చేరుకొని ఫీజులకు అడ్డుపడటంతో షార్ట్ సర్క్యూట్ అయి తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.